క్లుప్తంగా

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



గుడ్లవల్లేరు: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని గుడివాడ రూరల్ సీఐ కె.ఏసుబాబు తెలిపారు. గుడ్లవల్లేరు ఏఏఎన్ఎమ్ అండ్ వీవీ ఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం బాల్య వివాహాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. సమాజంలో దురాచారాలు, ర్యాగింగ్‌పై చట్టాలు, శిక్షలను వివరించారు. కార్యక్రమంలో కాలేజీ మెంటార్ ఎస్.ఎస్.ఎస్.వి.రామాంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సఫాయి కర్మచారిస్ సంఘం జిల్లా కార్యదర్శి ఎంపిక



గుడివాడ టౌన్: సఫాయి కర్మచారిస్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాడుగుల రేణు శివ కుమార్ ఎంపికయ్యారు. విజయవాడలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో జాతీయ అధ్యక్షుడు వీర్రాజు ఎంపికచేసినట్లు తెలిపారు. పట్టణ అధ్యక్షుడు వడ్డాది శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ముత్యాల రాజేష్ కుమార్, సంఘం సభ్యులు అభినందించారు.

వరిగడ్డి వాములు దగ్ధం



గుడివాడరూరల్: అగ్ని ప్రమాదంలో రెండు వరిగడ్డి వాములు దగ్ధమైన సంఘటన రామనపూడి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ యు.ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. రామనపూడి గ్రామంలో సిగరెట్ కాల్చి నిర్లక్ష్యంగా పడేయడంతో గోవుల ట్రస్ట్‌కు చెందిన రెండు వరిగడ్డి వాములు అగ్నికి ఆహుతయ్యాయని తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు మంటలను అదుపు చేశామని పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే డీఎన్నార్ పర్యటన

కైకలూరు: స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) నియోజకవర్గంలో ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని కార్యాలయ సిబ్బంది శనివారం చెప్పారు. ఉదయం 7 గంటలకు మండవల్లి మండలం లోకుమూడి గురువులోని దత్తాశ్రమంసందర్శిస్తారని, అనంతర 7.30 గంటలకు కైకలూరు శ్యామలాంబ అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రుల ప్రారంభోత్సవ గోపూజ కార్యక్రమంలో సతీసమేతంగా హాజరవుతారన్నారు. 9.30 గంటలకు ఆటపాకలో, 10.30 గంటలకు కలిదిండి మండలంకొళ్లపాలెం వద్ద సబ్ స్టేషన్ ప్రారంభోత్సం, 11.00 గంటలకు తామరకొల్లులో వివాహ రిసెప్షన్, వేమవరప్పాడులో బోడావుల నాగభూషణం ప్రథమ వర్ధంతి, రాత్రి 7 గంటలకు గోపవరంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ మెమోరియల్ రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.

నేటి నుంచి చెడుగుడు పోటీలు

కైకలూరు: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ మెమోరియల్ రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలను గోపవరం గ్రామంలో ఆదివారం రాత్రి ఎమ్మెల్యే డీఎన్నార్ ప్రారంభిస్తారన్నారు. 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని కమిటీ అధ్యక్షుడు దొండపాటి వినయ్ కుమార్ శనివారం చెప్పారు. మొదటి, రెండు, మూడో బహుమతులుగా రూ.25,000, రూ.20,000, రూ.15,000, నాలుగు, ఐదో బహుమతులుగా రూ.10,000, రూ.8,000 అందిస్తామన్నారు. నాకౌట్ బేసిక్‌లో జరుగుతాయి. ఈ నెల 15, 16 తేదీల్లో ఆటగాళ్ల టీం ఎంట్రీలను నమోదు చేసుకోవాలి. ఎంట్రీ ఫీజు రూ.1000, ప్రొటెస్ట్ ఫీజు రూ.15,00 చెల్లించాలి. వివరాలకు 91545 14750, 62817 10760 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

శరన్నవరాత్రులకు ముస్తాబు

- నేటి నుంచి 24వ తేదీ వరకు దసరా మహోత్సవాలు
- జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కైకలూరు శ్రీ శ్యామలాంబ క్షేత్రం
- ఆకట్టుకుంటున్న విద్యుత్ అలంకరణలు
- వివిధ అలంకారాల్లో దర్శనమివ్వనున్న అమ్మవారు

కైకలూరు: దసరా మహోత్సవాలకు కైకలూరు, గుడివాడ, పామర్రు నియోజకవర్గాల్లోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆయా నియోజకవర్గాల్లో ఆదివారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతున్నాయి. ఇందుకోసం ఆయా గ్రామాల్లో ప్రత్యేక దేవీ మండపాలను సిద్ధం చేశారు. అమ్మవారి ప్రత్యేక విగ్రహాలను మండపాల్లో ఉంచి ఉత్సవాలకు సిద్ధం చేశారు.

శ్యామలాంబ క్షేత్రంలో..

జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కైకలూరు శ్రీ శ్యామలాంబ క్షేత్రంలో చండీ మహాయాగ సహిత దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలకు ముస్తాబైంది. ఆదివారం ఉదయం 8.53 గంటలకు కలశ స్థాపనతో ప్రారంభించే కార్యక్రమాలు 24వ తేదీతో ముగుస్తాయి. ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మహోత్సవాలను ప్రారంభిస్తారు.

అందరి ఇళ్లలో 'అమ్మ' పేరు..

కైకలూరు, చుట్టు పక్కల గ్రామాల్లో ప్రతి ఇంటిలో ప్రతి తరంలోనూ కనీసం ఒక్కరి పేరైనా 'శ్యామలా' అనే ఉచ్చరణ వచ్చేలా పేర్లు పెట్టడం ఇక్కడ విశేషం. స్థానిక వ్యాపార సంస్థలు, దుకాణాల పేర్లలో సగం దుకాణాల పేర్లు శ్యామలకు సంబంధించినవే. కై కలూరు నడిబొడ్డున శ్యామలరావు, శ్యామలా అని పిలిస్తే పదుల సంఖ్యలో తలలు తిప్పేవారు కనిపిస్తారు. గ్రామంలో 400 సంవత్సరాలు పైబడి చరిత్ర కలిగిన అమ్మవారు ఉగ్రరూపంగా ఉండటంతో దైవజ్ఞులు 16 కళలున్న అమ్మను 14 కళలకు శక్తిని కుదించారు. తర్వాత 1967లో అమ్మను దర్శించుకున్న కంచికామకోటి పీఠాధిపతి చంద్రశేఖర సరస్వతి శ్యామలాంబను మహామంత్ర దేవతగా గుర్తించి తిరిగి 16 కళలకు శక్తిని పెంచారు. ఆలయం శిథిలావస్థకు చేరడంతో 2007 జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించి 2008లో జగద్గురు కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి చేతుల మీదుగా దేవాలయ పునఃప్రతిష్ఠ చేశారు.

అమ్మవారి అలంకారాలు..

ఆదివారంనాడు బాలాత్రిపుర సుందరీ దేవి, 16న గాయత్రీదేవి, 17న రాజరాజేశ్వరి దేవి, 18న ధనలక్ష్మి దేవి, 19న ధాన్యలక్ష్మి దేవి, 20న సరస్వతి దేవి, 21న దుర్గాదేవి, 22న పార్వతి దేవి, 23న మహిషాసురమర్ధిని దేవి, 24న పుష్పశయన అవతారాల్లో శ్యామలాంబ తల్లి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.



విద్యుత్ కాంతుల్లో శ్యామలాంబ ఆలయం

పామర్రు: దసరా నవరాత్రులు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. పలు ఆలయాలను శనివారం సిద్ధం చేశారు. స్థానిక అంకమ్మతల్లి ఆలయం, కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయం, పర్వత వర్ధనీ దేవి ఆలయం, సోమేశ్వరస్వామి, విష్ణాలయంలో నవరాత్రుల నిర్వహణకు ఆలయాలను విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దుతున్నారు. ఆలయానికి మామిడి మండలతో అలంకరించారు. పసుపు కుంకుమలతో ఆలయంలోని ద్వారాలను అలంకరిస్తున్నారు. ప్రతి రోజూ ఒక అలంకారంతో అమ్మవారిని అలంకరించి విశేషంగా పూజలు చేస్తారు. సోమేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని విదాల సౌకర్యాలను కల్పించామని ఆలయ మేనేజర్ కందుల వెంకటరెడ్డి తెలిపారు. భక్తులకు ఏవిధమైన అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

ముదినేపల్లి రూరల్ పరిధిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలో దసరా ఉత్సవాలకు ఆలయ నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్న సింగరాయపాలెం శ్రీఅమృతేశ్వరస్వామి, శ్రీలక్ష్మీనృసింహస్వామి, గురజ శ్రీగంగాపార్వతీసమేత విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో ఈ ఉత్సవాలు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గురజలో ఈ ఉత్సవాలను స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ప్రారంభిస్తారు.



పామర్రులో ముస్తాబైన విష్ణాలయం



శ్యామలాంబ అమ్మవారు

> **దసరా ఏర్పాట్లు పూర్తి..**
>
> శ్యామలాంబ అమ్మవారి దేవస్థానంలో దసరా మహోత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గుర్రం రాంబాబు, ధర్మకర్తల ఆధ్వర్యాన భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాం. వినోద కార్యక్రమాల్లో భాగంగా కోలాటం, హరికథ, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, పౌరాణిక నాటకలు ప్రదర్శించనున్నారు.
>
> –వీఎన్‌కే.శేఖర్, ఆలయ ఈవో, కైకలూరు

సింగరాయపాలెంలో...

సింగరాయపాలెం శ్రీఅమృతేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా 24న పుష్పసయ్యాలంకరణ జరుగుతుందన్నారు. ఇదే గ్రామంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ మీగడ నెలబాలుడు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 20న లక్షతులసీ పూజ, లక్ష్మీ అమ్మవారికి లక్ష కుంకుమ పూజ, 23న శనిపూజ, గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

కలిదిండిలో..

కలిదిండి: మండలంలో దసరా మహోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం నుంచి 24వ తేదీ వరకు వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. సంతోషపురం, సానారుద్రవరం, కోరుకొల్లు కనకదుర్గాదేవీ ఆలయాల్లో, మూలలంక పెద్దింట్లమ్మ దేవస్థానం దేవీ శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహించడానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాల వద్ద విద్యుత్ అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

అభివృద్ధిపై విస్తృతంగా ప్రచారం చేయండి

ఎమ్మెల్సీ జయమంగళ, ఎమ్మెల్యే డీఎన్నార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్, వేదికపై ఎమ్మెల్సీ జయమంగళ

ముదినేపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు అర్థమయ్యే రీతిలో ప్రచారం చేయాలని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులకు సూచించారు. 'రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమంపై శిక్షణా సమావేశం సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య, వైద్యం, సంక్షేమ ఫలాలు పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. దళారుల ప్రమేయం లేకుండా సంక్షేమ ఫలాలను నేరుగా ప్రజలకే అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. ఇలాంటి అభివృద్ధి పనుల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ వలంటీర్లు జగనన్నకు సైనికుల్లాగా పనిచేయాలని కోరారు. గృహసారథులు వలంటీర్లతో సమన్వయం చేసుకొని అభివృద్ధి పనుల గురించి తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. చంద్రబాబు హయాంలో జరిగిన అవినీతిని ప్రజలకు తెలియజేస్తూ ప్రస్తుతం జగనన్న పాలనలో జరుగుతున్న పారదర్శకత అవినీతికి తావులేని పాలన గురించి వివరించి పార్టీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. సమావేశంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు కోమటి విష్ణువర్ధన్, బొర్రా శేషుబాబు, రాచూరి కుమార్, శివనాగేంద్ర, బోయిన రామరాజు, నాగరాజు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

అక్కినేని పోస్టల్ స్టాంపు ఆవిష్కరణ



తపాలా స్టాంప్‌లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

గుడివాడ టౌన్: సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో శనివారం జరిగాయి. అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు ఎం.రామకృష్ణ, ఆల్ ఇండియా ఏఎన్నార్ ఫ్యాన్స్ కార్యదర్శి వడ్డాది రాజేష్ ఆధ్వర్యంలో ఏఎన్నార్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుంచి ఏఎన్నార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత అక్కినేని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 1959లో ఈ కళాశాల నిర్మాణానికి రూ.లక్ష వితరణగా ఇచ్చిన విద్యాదాత అక్కినేని అని అన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దేవు నరసింహారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అక్కినేని పోస్టల్ స్టాంపులను నిర్వాహకులు ఆవిష్కరించారు. అనంతరం అక్కినేని జీవిత సాఫల్య పురస్కార గ్రహీత వడ్డాది రాజేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, కార్యదర్శి కేఎస్ అప్పారావు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస చక్రవర్తి, డాక్టర్ మయూర్‌నాథ్‌శర్మ, జి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాసు పుస్తకాల పంపిణీ



పాస్ పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో బీఎం దుర్గారావు, తదితరులు

మండవల్లి: విద్యార్థి దశ నుంచే బ్యాంకు సేవలు వినియోగించుకోవాలని స్థానిక ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. మండలంలోని లోకుమూడి హైస్కూల్‌లో శుక్ర, శనివారాల్లో వంద మంది విద్యార్థులకు జీరో బ్యాలెన్స్‌తో ఖాతాలను తెరచి పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, బ్యాంకు లావాదేవీల నిర్వహణపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ విద్యార్థులు పొదుపుపై అవగాహన పెంపొందించుకోవడం వలన ఆర్థిక క్రమశిక్షణ అలవడి, దురలవాట్లకు దూరంగా ఉండి ఉత్తమ పౌరులుగా విలసిల్లుతారన్నారు. మండవల్లి హైస్కూల్‌లో 150 మంది విద్యార్థులకు, లింగాల హైస్కూల్‌లో 200 మంది విద్యార్థులకు జీరో అకౌంట్ తెరచినట్లు పేర్కొన్నారు. ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్.భాస్కరరావు, ఉపాధ్యాయులు పి.నాగేశ్వరరావు, సాయిబాబా, డి.అనిల్, టి.హరిబాబు, వి.వేణు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంతిమ సంస్కారం



ఖననం అనంతరం నివాళులర్పిస్తున్న ఆర్‌కే యూత్ సభ్యులు

గుడివాడ టౌన్: అనాథ వృద్ధురాలి మృతదేహానికి అంతిమ సంస్కారం నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్న ఆర్‌కే యూత్ సేవలను పలువురు అభినందించారు. సామాజికవేత్త రామకృష్ణ (ఆర్‌కే) మిత్రబృందం అనాథ శవాలను పూడ్చిపెట్టడం, దహనం చేయించడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. స్థానిక చౌదరిపేటకు చెందిన జయమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె బంధువుల ఆచూకీ తెలియకపోవడంతో ఆర్‌కే బృందం సభ్యులు ఆమె మృతదేహాన్ని ఖననం చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ మీరా షరీఫ్, మట్టా జగదీష్, కిరణ్, శివ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలనతో దిగుబడులు అధికం



ఎలుకల మందు తయారీని వివరిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి పద్మావతి

పామర్రు: సామూహిక ఎలుకల నివారణ చర్యలను పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎన్.పద్మావతి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో సామూహిక ఎలుకల నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 4.10 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని అన్నారు. దీనిలో ప్రస్తుతం 3 లక్షల ఎకరాల వరకు వరి పంట చిరుపొట్టదశలో ఉందని గుర్తించామన్నారు. ఎలుకలు చిరుపొట్ట దశలో ఉన్న వరి పంటను కొరికి నాశనం చేస్తాయని, ఈ సమయంలో సామూహికంగా ఎలుకలను నివారించే చర్యలు చేపడితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఎలుకల నివారణ మందు బ్రోమోడయోలిన్‌ను నూకలు, నూనెలో కలిపి ఎరగా తయారు చేసుకోవాలని, చిన్న చిన్న పొట్లాలు కట్టి గుర్తించిన ఎలుక బొరియల్లో వేయాలన్నారు. 96 శాతం నూకలు, 2 శాతం నూనె, 2 శాతం బ్రోమోడయోలిన్ మందు మిశ్రమంగా తయారు చేసి ఎలుకల నివారణకు ఉపయోగించాలని తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతి మండలానికి మూడు డ్రోన్‌లు మంజూరయ్యాయని కావాల్సిన వారు సంబంధిత ఆర్బీకేల వద్ద సంప్రదించాలని తెలిపారు. పామర్రు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పామర్రు ఏడీఏ స్వర్ణలత, ఏవో శివనాగరాణి, జెడ్పీటీసీ కె స్వరూపరాణి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా బోర్డు డైరెక్టర్ బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, పామర్రు పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మారెడ్డి నారాయణరెడ్డి, రైతులు వంశీరెడ్డి, బొమ్మారెడ్డి మాధవరెడ్డి, బి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో అన్నసమారాధన



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి సుబ్రహ్మణ్యం

గుడివాడ టౌన్: స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, కోర్టు ఉద్యోగులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం అన్నసమారాధనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మలచర్ల శ్రీనివాస్, సీహెచ్ వెంకట రమణ, ఉపాధ్యక్షుడు సీహెచ్ కుటుంబరావు, న్యాయవాదులు హరనాథ్, రఫీ, న్యాయవాద గుమస్తాలు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



సాయం అందజేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మారెడ్డి నారాయణరెడ్డి

పామర్రు: స్థానిక పంచాయతీ కార్యాలయంలో టైపిస్టుగా ఉద్యోగ విరమణ చేసి, పామర్రు పీఏసీఎస్‌లో సభ్యురాలిగా ఉన్న బొమ్మారెడ్డి మల్లీశ్వరి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మారెడ్డి నారాయణరెడ్డి సభ్యులతో కలిసి శనివారం మల్లీశ్వరి మృతదేహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు మృతురాలి కుటుంబానికి తక్షణ సాయం కింద పీఏసీఎస్ నిధులు రూ.10 వేలను మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆర్బీకే అధ్యక్షుడు ఏ శ్రీనాథ్‌రెడ్డి, కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు బొమ్మారెడ్డి అప్పిరెడ్డి, బీ మాధవరెడ్డి, మావులూరి శేషురెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

లబ్ధిదారులకు టిడ్కో గృహాల అప్పగింత



ఇంటి తాళాలు అందజేస్తున్న పార్టీ నేతలు

గుడివాడటౌన్: పట్టణంలోని పలు వార్డులకు చెందిన టిడ్కో గృహాల లబ్ధిదారులకు వైఎస్సార్ సీపీ నేతలు శనివారం తాళాలు అందజేశారు. స్థానిక కైకాల సత్యనారాయణ కళా మందిరంలో 550 మంది పైబడి లబ్ధిదారులకు తాళాలు అందజేశామని చెప్పారు. ఇప్పటికే 3వేలు పైగా లబ్ధిదారులకు ఇళ్లను పూర్తి వసతులతో అప్పగించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చుండూరి శేఖర్, మైనార్టీ సెల్ నాయకుడు అలీబేగ్, మహిళా విభాగం సభ్యురాలు ఉమ, 17వ వార్డు ఇన్‌చార్జ్ దారం కాంచన, మున్సిపల్ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

110 మంది రోగులకు వైద్య పరీక్షలు



హనుమంతపురంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పమిడిముక్కల: మండలంలోని హనుమంతపురం గ్రామంలో రోటరీ కమ్యూనిటీ ట్రస్ట్ ఉయ్యూరు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు రవికుమార్, అనిత రోగులకు పరీక్షలు జరిపి, అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్య శిబిరాన్ని రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వరరావు, నాగసుబ్రమణ్యం ప్రారంభించారు. కార్యక్రమంలో కేసీపీ జీఎం పున్నారావు, డీజీఎం సూర్యారావు, డెప్యూటీ మేనేజర్ శ్రీరామచంద్రరావు, రైతులు, కేసీపీ సిబ్బంది పాల్గొన్నారు.

రంగారావు మృతికి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే సంతాపం



కలిదిండిలో రంగారావు మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

కలిదిండి: వివిధ కారణాలతో కలిదిండి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతి పరులు బోయిన రంగారావు మృతి చెందారు. ఆయన పార్థివ దేహాన్ని శనివారం ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇరువురి కుటుంబాలను పరామర్శించి సానుభూతి తెలిపారు. మాజీ ఏఎంసీ చైర్మన్ నీలపాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు తిరుమాని రమేష్, ఏఎంసీ వైస్‌చైర్మన్ పాము రవికుమార్, నాయకులు చిట్టూరి బుజ్జి, మసిముక్కుల వెంకటేశ్వరరావు, మోకా భోగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు వెంపటి చినసత్యం జయంతి

మొవ్వ: మండలంలోని కూచిపూడిలో శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం జయంతి ఉత్సవం ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయ సిబ్బంది శనివారం తెలిపారు. రాష్ట్ర టూరిజం, సాంస్కృతిక శాఖ, కృష్ణా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆర్కే రోజా, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్,మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొంటారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

ఆధ్యాత్మిక భావన పెంపొందాలి



మాజీ కలెక్టర్ లక్ష్మీకాంతంను సన్మానిస్తున్న స్థానికులు

పామర్రు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలని, అప్పుడే సమాజం శాంతియుతంగా మారుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ జేఈవో, కృష్ణా జిల్లా మాజీ కలెక్టర్ డాక్టర్ బీ లక్ష్మీకాంతం అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పర్యటనలో భాగంగా పామర్రుకు శనివారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవత్ చింతనను అందరూ అలవర్చుకోవాలన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ వలన గ్రామాల్లో సోదర భావం పెరుగుతుందని అన్నారు. అనంతరం పామర్రు అయ్యప్ప స్వాములు, లక్ష్మీకాంతం సేవా సమితి ఆర్గనైజేషన్ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయనను శాలువాలతో ఘనంగా సత్కరించారు. పలువురు స్థానికులు అయ్యప్ప దీక్షాపరులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.